

మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, వేదికపై ఎమ్మెల్యే మేఘారెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ తదితరులు

సమాజంలో విలువలు పెంచేవి గ్రంథాలయాలు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : సాంకేతికత పెరిగిన నేపథ్యంలో సమాజంలో విలువలు, సంస్కృతిని, ధైర్యాన్ని పెంచేవి గ్రంథాలయాలేనని ప్రొహిబిషన్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో వనపర్తి గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా గోవర్ధన్‌సాగర్ ప్రమాణస్వీకార కార్యక్రమం ఎమ్మెల్యే మేఘారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జిల్లాలోని ప్రతి మండలంలో గ్రంథాలయాలను పండగ వాతావరణంలో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకు కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. నల్లచెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు బోటు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా వెంటనే మంజూరు చేశారన్నారు. అనంతరం సంస్థ ఛైర్మన్‌గా గోవర్ధన్‌సాగర్‌ను గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మంత్రి, వనపర్తి ఎమ్మెల్యేతో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, పలువురునాయకులు, కార్యకర్తలు గోవర్ధన్‌సాగర్‌ను సన్మానించారు.

భారాస పాలనలో రాష్ట్రం అప్పులపాలు

వనపర్తి న్యూటౌన్: భారాస నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం ఆయన వనపర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డితో కలిసి వనపర్తిలో విలేకరులతో మాట్లాడారు. దీపావళి నాటికి రూ.2 లక్షలు రుణమాఫీ పూర్తి చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో ఆక్రమణలు భారాస పుణ్యమేనని విమర్శించారు. వనపర్తి జిల్లాలో ప్రభుత్వ స్థలాలను ఆపార్టీ మహానుభావులు కబ్జా చేశారన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి విషయంలో రాజీవ్‌చౌక్‌లో చర్చకు సిద్ధమా అని భారాస నాయకులకు సవాల్ విసిరారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అలీబాబా అరడజను దొంగల మాదిరిగా భారాస నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దోచుకున్నారని ఆరోపించారు.

నివేదిక సిద్ధమయ్యేనా?



శంకరసముద్రం నుంచి వృథాగా వెళ్తున్న జలాలు

ఈనాడు మీ తోడు

కొత్తకోట, న్యూస్‌టుడే : 'దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదని' చందంగా ఉంది శంకరసముద్రం నిర్వాసితుల పరిస్థితి. గత నెల 25న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి తదితరులు శంకరసముద్రం జలాశయాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. రూ.75 కోట్లు మంజూరు చేస్తే సమస్యలు పరిష్కారమై గ్రామం రూపురేఖలు మారడమే కాకుండా 1.818 టీఎంసీల నీటి నిల్వతో 85 వేల ఎకరాలకు పైగా సాగులోకి వస్తాయని అధికారులు వివరించగా అంచనాలు సిద్ధం చేసి వారంలోగా నివేదిక ఇవ్వాలంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది.

ఆర్ అండ్ ఆర్‌కు 1,129 కుటుంబాలు

ఆర్ అండ్ ఆర్ (రిహాబిటేషన్ రీ సెటిల్‌మెంట్) పేరుతో గ్రామంలో సోషియా ఎకానమీ నిర్వహించిన సర్వేలో 1,129 కుటుంబాలను గుర్తించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల పూర్తిగా మార్చాల్సిన కుటుంబాలు కేవలం 95 మాత్రమే కాగా పరిసర కుటుంబాలుగా 1,034ను గుర్తించారు. వీరికి పునరావాసం కల్పించాలని ప్రభుత్వం పరిహారం విడుదల చేస్తూ సీ ఫారాలను అందించింది. ఈ క్రమంలో 2021 అక్టోబరు నాటికి 24 కుటుంబాలు మినహా 1010 కుటుంబాలు ఇళ్లు ఖాళీ చేసేందుకు అంగీకరిస్తూ సీ ఫారాల్ని రెవెన్యూ శాఖకు అందజేశారు. ఇళ్లు ఖాళీ చేసేందుకు అయ్యే ఖర్చుల్ని కలిపి మొత్తం రూ. 26.94 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. రూ.26.36 కోట్లకు పైగా లబ్ధిదారులకు అందజేశారు. రూ.58 లక్షలు చెల్లించాల్సి ఉందని నివేదిక సిద్ధం చేశారు.

అవే సమస్యలు..

2007 నాటి పరిస్థితికి అనుకూలంగా నిర్వాసితుల గుర్తింపు, పరిహారం విడుదల చేశారని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రభుత్వం గ్రామాన్ని ఖాళీ చేసే పరిస్థితులు కల్పించకపోవడంతో 2019 నాటికి గ్రామంలో 18 ఏళ్లు నిండిన వారి సంఖ్య పెరిగింది. వారందరినీ నిర్వాసితులుగా గుర్తించి ఇళ్ల మంజూరు, పరిహారం ఇవ్వాలని డిమాండ్ ఉండటంతో గత ప్రభుత్వం అంగీకరిస్తూ జీవో విడుదల చేసింది. 2018లో నిర్వహించిన సర్వేలో 296 కుటుంబాలను గుర్తించగా.. సెప్టెంబర్ 2019 నాటికి 601 కుటుంబాలు (వ్యక్తుల్ని) నిర్వాసితులుగా పెరిగారు. ఈ క్రమంలో పునరావాస ప్రదేశంలో 111.27 ఎకరాల్లో 1,129 ఇళ్ల స్థలాలు కేటాయించగా 21 ఇంటి స్థలాలు మిగిలి ఉన్నాయి. సర్దుబాటులో 15 ఎకరాల భూమి అందుబాటులో ఉందని అధికారులు నివేదిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి అందిన నివేదిక ఆధారంగా పునరావాస ప్రదేశంలో పనులు మరో వారం, పది రోజుల్లో ప్రారంభమవుతాయని అధికారులు భావిస్తున్నారు.

ఆగని తవ్వకాలు

ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా క్వారీల్లో అక్రమాలు



జడ్చర్లలోని శంకరాయపల్లి గుట్టలోని క్వారీ పరిస్థితి

ఈనాడు, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని మైనింగ్ అక్రమాలపై ఇటీవల వచ్చిన ఫిర్యాదులు, విచారణలు చర్చనీయాశంగా మారాయి. గతంలో ఇక్కడ పని చేసిన ఆ శాఖ ఏడీ సస్పెన్షన్‌కు గురి కావడం, జడ్చర్ల సమీపంలోని శంకరాయపల్లిలో తవ్వకాలపై ఉన్నతాధికారుల విచారణతో మరోసారి గనుల అక్రమాలు తెరపైకి వచ్చాయి. గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో మైనింగ్ వ్యాపారం నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నా పట్టించుకొనే నాథుడే కరవయ్యారు. అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వుతూ కొందరు నిర్వాహకులు రూ.కోట్లు దండుకొంటున్నారు. వీరికి కొందరు అధికారులు సహకరిస్తుండటంతో అక్రమాలకు అడ్డే లేకుండాపోతోంది.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 285 క్వారీలకు అనుమతులిచ్చారు. వీటిలో క్వార్ట్జ్, ఫెల్స్‌ఫార్, స్టోన్ అండ్ మెటల్, కలర్ గ్రానైట్, బ్లాక్ గ్రానైట్, మొరం వంటి వాటికి మైనింగ్ శాఖ అనుమతులిచ్చింది. పలు క్వారీల్లో అనుమతులు తీసుకున్న దాని కంటే అధికంగా గుట్టలను తవ్వేస్తున్నారు. టన్ను రాయికి రూ.80, మొరం మట్టికి రూ.35 రాయల్టీ చెల్లించాలి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ సీఎం సొంత జిల్లాలోనే ఈ అక్రమాలు ఆగడం లేదు.

సర్వే పేరుతో కాలయాపన..: పాలమూరులో ఎక్కడెక్కడ మైనింగ్ పేరుతో అక్రమంగా క్వారీలు తవ్వి అక్రమంగా తరలిస్తున్నారో ఆ శాఖకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. కొన్ని చోట్ల మైనింగ్ శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది ఎక్కడ అక్రమాలు జరుగుతాయో అక్కడ వాలిపోతారన్న విమర్శలు ఉన్నాయి. అయినా అక్రమార్కులపై చర్యలు మాత్రం ఉండవు. ఎక్కడైనా ఆరోపణలొస్తే డీజీపీఎస్ సర్వే చేపడుతున్నామని అక్రమాలు అందులో వెల్లడవుతాయని చెప్పి తప్పించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మైనింగ్ శాఖకు చెందిన పలువురు అధికారులు గత పదేళ్లుగా డీజీపీఎస్ సర్వే పేరుతోనే పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

మచ్చుకొన్ని..

- మహబూబ్‌నగర్ జిల్లా శంకరాయపల్లిలో మూడు క్వారీలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. దేవరకద్ర నుంచి కోయిల్‌సాగర్ వెళ్లే దారిలోనూ ఓ గుట్టను క్వారీ అనుమతుల పేరుతో కొల్లగొట్టారు. మిడ్జిల్ మండలం లింబ్యాతండాల్లోనూ కొందరు వ్యక్తులు పోటీ పడి మైనింగ్ ద్వారా రూ.లక్షల్లో సంపాదించుకున్నట్లు ఆరోపణలున్నాయి. భూత్పూరు మండలంలో పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. బాలానగర్, మిడ్జిల్ మండలాల్లో పలుగురాళ్ల పేరుతో యథేచ్ఛగా దోపిడీ సాగుతోంది.
- జోగులాంబ గద్వాల జిల్లాలో ఇద్దరు ప్రధాన నేతలకు క్వారీలున్నాయి. ఇక్కడ నిబంధనల్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. రూ.కోట్లలో రాయల్టీని ఎగ్గొట్టేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.
- వనపర్తి జిల్లా కొత్తకోట, పెద్దమందడి, గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో క్వారీల నుంచి ఇష్టారాజ్యంగా పేలుళ్లు చేసి అక్కడే క్రషర్ యంత్రాల ద్వారా కంకరగా మార్చి విక్రయిస్తున్నారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని పలుగురాళ్ల పేరుతో తీసుకున్న మైనింగ్ అనుమతులు స్థానికంగా వివాదాస్పదమయ్యాయి. దీనిపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. కొల్లాపూర్, అచ్చంపేట, ఉప్పునుంతల, తాడూరులోనూ గుట్టలను నిబంధనలకు విరుద్ధంగా తవ్వి వ్యాపారం చేస్తున్నారు.
- నారాయణపేట జిల్లాలో రాయచూర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొనే పలు చోట్ల మైనింగ్ వ్యాపారం నడుస్తోంది. ఇక్కడ పూర్తిగా నిబంధనలను పక్కకు పెట్టి వ్యాపారం చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.
- పాలమూరులో ఏ పల్లెకు వెళ్లినా మొరం కోసం యథేచ్ఛగా తవ్విన మట్టి గుట్టలే కనిపిస్తాయి. ఎలాంటి పెట్టుబడి లేకుండా రూ.లక్షల్లో సంపాదన ఉండటంతో చాలామంది గ్రామాల్లో ఉన్న మట్టిగుట్టలను తవ్వి వ్యాపారం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల పేరుతోనూ ఇష్టారాజ్యంగా మొరం మట్టి కోసం గుట్టలను మాయం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : రహదారులు, భవనాల శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో వేగం పెంచాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. గురువారం వనపర్తి కలెక్టరేట్ కార్యాలయంలో రోడ్లు, భవనాలశాఖ ఇంజినీర్లు, పురపాలికల కమిషనర్లు జిల్లాలో పెండింగ్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనాపూర్ వంతెన పనులు, కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల వెనక భాగంలో వసతిగృహాల పనులను ఆయా శాఖాధికారులకు త్వరగా పూర్తి చేయాలన్నారు. వనపర్తి పట్టణం, ఖిల్లాగణపురం, పెబ్బేరు, పాన్‌గల్ తదితర రహదారుల విస్తరణ పనులను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు దేశ్యనాయక్, డీఈ సీతారామశాస్త్రి, పుర కమిషనర్ పూర్ణచందర్, తహసీల్దార్ కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లోని కవాతు మైదానంలో సాధన చేస్తున్న పోలీసులు

శిక్షణకు 42 మంది ఏఎస్సైల ఎంపిక

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో 42 మంది ఏఎస్సైలు ఎస్సై శిక్షణకు ఎంపికయ్యారు. వారికి ఈ నెల 22 నుంచి 12 వారాల పాటు హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట్రామా రెడ్డి పోలీస్ అకాడమిలో శిక్షణకు ఇస్తారు. ఇందుకు జోగులాంబ జోన్ డీఐజీ ఎస్ఎస్ చౌహాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 16 మంది, మహబూబ్‌నగర్ నుంచి 10, వనపర్తి నుంచి 09, జోగులాంబ గద్వాల నుంచి ఐదుగురు, నారాయణపేట జిల్లా నుంచి ఇద్దరు చొప్పున ఎంపికయ్యారు. 1986, 1987, 1989 కానిస్టేబుల్ బ్యాచ్‌లకు చెందిన వారిలో ప్రస్తుతం ఏఎస్సైగా పనిచేస్తున్న వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 21న వారంతా హైదరాబాద్‌లో రిపోర్టు చేయనున్నారు. శిక్షణ తర్వాత అన్ని విభాగాల్లో ఉత్తీర్ణత సాధిస్తే వారిని ఖాళీలు ఉన్న పోలీస్ స్టేషన్లలో ఎస్సైలుగా నియమిస్తారు. ఖాళీలు లేకపోతే వారు ప్రస్తుతం పనిచేస్తున్న స్టేషన్లలోనే ఏఎస్సైలుగా కొనసాగుతారు. జోగులాంబ జోన్ పరిధిలో ఎస్సై పోస్టులు ఖాళీగా ఏర్పడితే ఆ ఏఎస్సైలకు పదోన్నతి కల్పించి నియమిస్తారు.

రిజర్వులో మరో ఐదుగురు సిద్ధం : ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సివిల్ ఏఎస్సైలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారిలో శిక్షణకు వెళ్లడానికి ఇష్టం లేకపోయినా, అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్నా, వారి స్థానాల్లో తర్వాత సీనియారిటీ జాబితాలో ఉన్న వారికి అవకాశం కల్పిస్తారు. ఇందుకు మరో ఐదుగురి పేర్లతో జాబితా సిద్ధం చేశారు.

తాగునీరు సురక్షితమేనా!

ఇంటింటికి శుద్ధజలం సరఫరా చేయాలని ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మురుగు కాలువల్లో, వాటి పక్కనుంచి ఏర్పాటు చేసిన వీటితో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. కొన్నిచోట్ల కనీస ప్రమాణాలు పాటించకుండా మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు తారునీటి కలుషితంపై ఆందోళన చెందుతున్నారు. వీటి గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద..

మురుగు కాలువల్లో కనెక్షన్లు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 23వ వార్డు మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపోకు వెళ్లే దారిలో, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో మంచి నీటి నల్లా కనెక్షన్లు మురుగు కాలువలో ఉన్నాయి. పైపులైన్‌కు లీకేజీ గురైతే తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. పైపులైన్‌ను మురుగు కాలువ నుంచి తొలగించాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ పూర్ణచందర్‌ను వివరణ కోరగా ఏఈతో మాట్లాడి పైపులైన్ వేరుగా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన



నేతాజీనగర్‌లో మురుగు కాలువలో పైప్‌లైన్

హడావుడిగా పనులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని నేతాజీనగర్, గార్లగుట్ట ప్రాంతాల్లో మురుగు కాలువల్లో తాగునీటి పైప్‌లైన్లతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మిషన్ భగీరథ పథకం పనుల్లో భాగంగా ఈ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. గుత్తేదార్లు కనీస ప్రమాణాలు పాటించకుండా హడావుడిగా పనులు పూర్తి చేశారు. వీటి మీదుగా మురుగు పారుతోంది. వర్షం కురిసినప్పుడు ఇవి మురుగుపై తేలుతుంటాయి. మిషన్ భగీరథ, పురపాలిక తాగునీటి విభాగం సిబ్బంది వీటి గురించి పట్టించుకోవడం లేదు.

లీకేజీలను పట్టించుకో లేదు!

అమరచింత, న్యూస్‌టుడే : స్థానిక ఆజాద్‌నగర్, పాత ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ ఆరో వార్డు, శివాజీనగర్, డీఎంఆర్ఎం ప్రాథమిక పాఠశాల వద్ద మిషన్ భగీరథ పైపులు మురుగు కాలువల పక్కన, వాటి పైనుంచి వెళ్లాయి. సవరమ్మ దేవాలయం పక్కన, గాజుల మహిమూద్ ఇంటి ఎదుట పైపులైన్ లీకేజీ అయి ఆరు నెలలు కావస్తున్నా పట్టించుకోవడం లేదు. పుర అధ్యక్షురాలు వి.మంగమ్మ మాట్లాడుతూ పట్టణ ఏఈతో మాట్లాడి కాలువల పక్కన పైపులు లేకుండా చర్యలు తీసుకుంటామని, లీకేజీలను అరికడతామన్నారు.



అజాద్ నగర్‌లో ఇలా..

ధాన్యానికి బోనస్ ఎలా ఇస్తారంటే...

బోనస్... బోనస్.. వరిరైతు నోట ఈ సారి ఇదే మాట..
సన్నాలకే వర్తింపజేస్తామని అధికారులు చెబుతున్నా, అవి ఏమిటనేది రైతుల్లో సందేహం ఉంది.
ఏ రకం ధాన్యానికి ఇస్తారు. ఎలాంటి నిబంధనలు ఉన్నాయో తెలుసుకుందాం.


న్యూస్‌టుడే, నారాయణపేట న్యూటౌన్

ఉమ్మడి పాలమూరు జిల్లాలో వర్షాకాలం వరి ధాన్యం సేకరణకు పౌరసరఫరాల, సహకార, ఐకేపీ, మార్కెట్ కమిటీ అధికారులు సమాయాత్తమవుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ సారి రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్ ధాన్యానికి రూ. 5 వందలు బోనస్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టింది.

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ వర్షాకాలంలో వరి సాధారణ విస్తీర్ణానికి మించి సాగైంది. సాధారణ సాగు విస్తీర్ణం 6,35,144 ఎకరాలు కాగా ఈ సారి 7,64,914 ఎకరాల్లో సాగు చేశారు. అంటే 1,29,770 ఎకరాల్లో అదనంగా సాగు అయ్యింది. మొదట్లో వర్షాలు సరిగా పడకపోవడంతో విస్తీర్ణం తగ్గవచ్చని భావించారు. ముగింపులో మంచి వర్షాలు పడటంతో వ్యవసాయ బోర్లు రీఛార్జి కావడం, కుంటలు, చెరువులు నిండటంతో పుష్కలంగా సాగయ్యింది. బోనస్ వస్తుందనే నమ్మకంతో సాగు పెంచారని భావిస్తున్నారు.



రాంకిష్టాయపల్లి శివారులో సాగు చేసిన వరి



జిల్లా	సాధారణ సాగు	విస్తీర్ణం (ఎకరాలు)
నారాయణపేట	1,27,486	1,65,092
మహబూబ్‌నగర్	1,39,565	1,87,784
వనపర్తి	1,75,824	1,80,417
నాగర్‌కర్నూల్	1,09,344	1,41,274
జోగులాంబ గద్వాల	82,925	90,347

వీటికే బోనస్

బోనస్ ఇవ్వడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సన్నాల్లోని 33 రకాలకు వర్తింపజేశారు. ధాన్యం గింజ పొడువు, వెడల్పు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? అనేది తెలుసుకోవడానికి ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద ఈ సారి మైక్రో మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పొడవు 6 మిల్లీ మీటర్ల కంటే తక్కువ వెడల్పు రెండు మిల్లీమీటర్ల కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. ధాన్యం తేమ 17 శాతానికి మించనప్పుడు మాత్రమే కొనుగోలుకు తీసుకోవాలని నిర్దేశించారు.

వర్తించే రకాలు

సిద్ధి(డబ్ల్యుజీఎల్44)	జగిత్యాల్ మసూరి (జేజీఎల్11470)	రాజేంద్రనగర్ వరి - 4 (ఆర్ఎన్ఆర్ 21278)	సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465)
కంపసాగర్ వరి-1 (కేపీఎస్ 2874)	పొలాస ప్రభ (జేజీఎల్ 384)	కూనరం వరి- 1 (కేఎన్ఎం 733)	శోభిని (ఆర్ఎన్ఆర్ 2354)
సాంబ మసూరి (బీపీటీ 5204)	కృష్ణ (ఆర్ఎన్ఆర్ 2458)	జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798)	సోమ్‌నాథ్ (డబ్ల్యుజీఎల్ 347)
జగిత్యాల్ వరి- 3(జేజీఎల్ 27356)	మానేరు సోనా (జేజీల్ 3828)	జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844)	ఆన్ఆర్ఆర్ 31479(పీఆర్ఫ్)
జగిత్యాల్ వరి- 2(జేజీఎల్ 28545)	తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048)	కరీంనగర్ సాంబ (.జేజీఎల్ 3855)	కేపీఎస్ 6251 (పీఆర్ఫ్)
వరంగల్ సాంబ(డబ్ల్యుజీఎల్ 14)	వరంగల్ వరి - 1119	అంజన (జేజీఎల్ 11118)	జేజీఎల్ 33124 (పీఆర్ఫ్)
వరంగల్ సన్నాలు (డబ్ల్యుజీఎల్32100)	కూనరం వరి- 2 (కేఎన్ఎం 1638	నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449)	హెచ్ఎంటీ సోనా
	వరంగల్ వరి- 2 (డబ్ల్యుజీఎల్ 962)	ప్రత్యుమ్న (జేజీఎల్ 17004)	మార్టేరు సాంబ (ఎంటీయూ 1224)
	ఎంటీయూ 1271		మార్టేరు మసూరి (ఎంటీయూ 1262)



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ తదితరులు

వాల్మీకి మహర్షి జీవన విధానం ఆదర్శనీయం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జీవన విధానం భావితరాలకు ఆదర్శనీయమని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో వాల్మీకి జయంతి జరుపుకొన్నారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే మేఘారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సత్ప్రవర్తన, సన్మార్గంలో నడివడికతో మహర్షులవుతారని, వాల్మీకి జీవితం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాయణ మహాకావ్యం రచించడం ద్వారా సమాజానికి మానవ సంబంధాల విలువలను పరిచయం చేసిన వాల్మీకి మహర్షి స్ఫూర్తి ప్రధాత అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, ఆయా శాఖల అధికారులు, వాల్మీకి కులస్థులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థిరాస్తి వ్యాపారానికి కుంట పూడ్చివేత

గత ప్రభుత్వ పెద్దల సహకారంతో మాస్టర్ ప్లాన్‌లోనూ తొలగింపు

వెంచర్ ఏర్పాటుకు అనుమతి నిరాకరించిన జిల్లా ఉన్నతాధికారి

నిఘా

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం: మహబూబ్‌నగర్ పట్టణం నడిబొడ్డున దేవుడి పేరిట ఏర్పాటైన కాలనీ. ఉన్నత వర్గాలు నివాసముండే ఈ ప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారులు ఏర్పాటు చేయాలనుకున్న వెంచర్‌కు జిల్లా ఉన్నతాధికారి అనుమతి నిరాకరించటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రూ.కోట్ల విలువైన భూమిలో వెంచర్ ఏర్పాటుకు అనుమతులు దక్కకపోవడంతో స్థిరాస్తి వ్యాపారులు రాజకీయంగా పురపాలిక యంత్రాంగంపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు పెంచుతున్నారు. వెంచర్ ఏర్పాటుకు అనుమతులు నిరాకరించిన ఉన్నతాధికారి వద్దకు ఏ దస్త్రాలతో వెళ్లి అనుమతులు వచ్చేలా చేయాలో అర్థం కాక మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారి వెంచర్ ఏర్పాటుకు ఎందుకు అనుమతులు నిరాకరించారో తెలిస్తే ఒకింత ఆశ్చర్యం కలగక మానదు.

కనుమరుగు చేశారిలా.. : కాలనీ ఏర్పాటుకు ముందు ఓ రెవెన్యూ గ్రామ పరిధి ప్రైవేటు పట్టా భూమిలో నీటి కుంట ఉండేది. ఆ గ్రామం పురపాలికలో విలీనయ్యాక అర్బన్ మండలం పరిధిలోకి వచ్చింది. కుంటను 2010 మాస్టర్ ప్లాన్‌లో గ్రీన్ జోన్‌గా నిర్ధారించగా ఆ పట్టా భూమివారు జీర్ణించుకోలేకపోయారు. వారు తమ ఆలోచనకు పదును పెట్టారు. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నేత సహకారంతో కుంటను మాస్టర్ ప్లాన్ నుంచి 2022లో తొలగింపజేయించి ఆ భూమిని స్థిరాస్తి వ్యాపారులకు విక్రయించారు. కాలనీకి ఏకైక నీటి వనరుగా ఉన్న కుంటను కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారులు ఐదు నెలల క్రితం రాత్రికి రాత్రే పొక్లెయిన్లతో పూడ్చేసి చదును చేసే ప్రయత్నం చేశారు. అప్పట్లో టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేయగా స్థిరాస్తి వ్యాపారులు మాస్టర్ ప్లాన్‌లో కుంట తీసేసిన దస్త్రాలు, గెజిట్ నోటిఫికేషన్ పత్రాలు చూపించి వెనక్కి పంపించేశారు. ఇటీవల కుంట స్థలాన్ని చదును చేసి భారీ వెంచర్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్న స్థిరాస్తి వ్యాపారులు టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వారా జిల్లా ఉన్నతాధికారి అనుమతి కోసం వారం క్రితం దస్త్రం పంపించారు. దస్త్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారి కుంటను పూడ్చేసి వెంచర్ ఏర్పాటు చేయడమేమిటంటూ అనుమతి నిరాకరించినట్లు సమాచారం. ఉన్నతాధికారి అనుమతి నిరాకరించడంతో అటు టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇటు స్థిరాస్తి వ్యాపారులు కంగుతిన్నారు. ఎలాగైనా జిల్లా ఉన్నతాధికారి అనుమతి పొందాలన్న పట్టుదలతో స్థిరాస్తి వ్యాపారులకు సంబంధించిన ఓ సర్వేయర్ పురపాలిక కమిషనర్‌తో తీవ్ర స్థాయిలో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారి నీటి వనరుగా ఉన్న కుంటలో స్థిరాస్తి వ్యాపారానికి అనుమతులు ఇస్తారా లేక కుంటను మాస్టర్ ప్లాన్ నుంచి ఎందుకు తొలగించారని సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా అనేది వేచి చూడాల్సిందే.





నువ్వులు విరిశాయి!

విరబూసిన పూలతో నువ్వుల పంట కనువిందు చేస్తోంది. భూత్పూర్ మండలం గోప్లాపూర్ శివారులో ఓ రైతు నువ్వుల పంట సాగుచేశారు. ప్రస్తుతం ఆ పంట పూత దశలో ఉంది. లేత గులాబీ వర్ణంలో విరిసిన పూలతో పూలతోట ఉన్నట్లుగా కనిపిస్తోంది. పూలలోని మకరందాన్ని గ్రోలుతూ తేనెటీగలు సందడి చేస్తున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్న ఆ దృశ్యాలను 'ఈనాడు' క్లిక్ మనిపించింది. - ఈనాడు, మహబూబ్‌నగర్

బడికెళ్లాలంటే ఎన్ని కష్టాలో!



శాంతినగర్ ఉన్నత పాఠశాలకు వడ్డేపల్లి మండలం కోయిదిన్నె నుంచి 6 కి.మీ. ప్రయాణించి 20 మంది, మానవపాడు మండలం మద్దూరు నుంచి 12 కి.మీ. ప్రయాణించి 40 మందికి పైగా విద్యార్థులు వస్తున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో వీరంతా ప్రైవేటు వాహనాలు, సైకిళ్లపై వస్తున్నారు. ఇలా ప్రతి నెలా వీరు రూ.600 - 900 వరకు రవాణా కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది.

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్, అయిజ

రవాణా భత్యమూ చెల్లించని ప్రభుత్వం

గ్రామాలకు నిలిచిన ఆర్టీసీ బస్సులు

బడికెళ్లడానికి విద్యార్థులు నానా కష్టాలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వందలాది గ్రామాల విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులు పడుతూ ప్రమాదకర ప్రయాణాలు చేస్తూ పాఠశాలలకు చేరుకుంటున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం గతంలో రవాణా భత్యం అందించేది. ప్రస్తుతం విద్యాశాఖ ప్రతిపాదనలు పంపుతున్నా... నిధులు విడుదల కాకపోవడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోంది. కొన్ని గ్రామాల్లో తల్లిదండ్రులు ఏకంగా పిల్లలను బడి మాన్పించేస్తున్న పరిస్థితి.

ఐదు వేలకుపైగా: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో 3.20 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో దాదాపు నాలుగు వందలకుపైగా పాఠశాలలు విద్యార్థులకు దూరంగా ఉంటున్నాయి. దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం చెల్లించాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కిలోమీటరు దూరం వెళ్తుంటే.. 1 - 5వ తరగతి వారికి నెలకు రూ.400 చొప్పున, 3 కి.మీ. దూరం నుంచి వస్తున్న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.600 చొప్పున చెల్లించేవారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల మందికి ఈ భత్యం చెల్లించాల్సి ఉంది. ఏటా విద్యాశాఖ ప్రతిపాదనలు పంపుతున్నా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు.

ఇవిగో కొన్ని..

- వనపర్తి జిల్లా అమరచింత ఉన్నత పాఠశాలకు 6 కిలోమీటర్ల దూరంలో ధర్మాపురం నుంచి 10 మంది కాలినడకన విద్యార్థులు వస్తుంటారు. మూడు కి.మీ. దూరంలోని సంధ్యానాయకేతండా నుంచి 20 మందికి పైగా వస్తుంటారు. ఈ రెండు గ్రామాలకు బస్సు లేదు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి రావాల్సిందే. ఆరు కి.మీ. దూరంలోని కొంకలవానిపల్లి నుంచి 30 మందికి పైగా విద్యార్థులు వస్తుంటారు.
- రాజోలి మండలం తుమ్మిళ్ల గ్రామం నుంచి 5 కి.మీ. దూరంలోని పెద్దధన్వాడకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేదు. అడపాదడపా సైకిళ్లపై పయనిస్తూ పది మందికి పైగా బాలికలను వారి తల్లిదండ్రులు బడి మాన్పించారు.
- గద్వాల జిల్లా రాజోలి, అయిజ, వడ్డేపల్లి, ఉండవల్లి, మల్దకల్ మండలాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. సైకిళ్లపై వస్తూ కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ.. ప్రతి రోజూ రూ.30 - రూ.50 పైగా ఖర్చు చేస్తున్నారు.



ఊట్కూరు: కాలినడకన మక్తల్ ఉన్నత పాఠశాలకు నడచివెళుతున్న ఊట్కూరు మండలం పెద్దపొర్ల విద్యార్థులు వీరు. సుమారు నాలుగు కిలోమీటర్లు నడిచి స్టేజీ వరకువెళ్లి అక్కడి నుంచి 12 కి.మీ. దూరంలోని మక్తల్‌కు బస్సుపై చేరుకుంటారు. రోజూ సుమారు 50 మంది విద్యార్థులు ఇలా వెళుతుంటారు. గ్రామానికి తారురోడ్డున్నా బస్సు సౌకర్యం మాత్రం లేదు.

రవాణా భత్యం అందించాలి



నేను, నాతో పాటు మరో 30 మంది కలిసి మా గ్రామం నుంచి చదువుకోవడానికి 12 కి.మీ. దూరంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నాం. బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో వస్తున్నాం. మా లాంటి వారి కోసం ప్రభుత్వం రవాణా భత్యం ఇస్తారని సార్లు చెప్పారు. ఇప్పటి వరకు ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలి. **-ఆనంద్, 8వ తరగతి, తుమ్మిళ్ల**

ఉన్నతాధికారులకు తెలిపాం

విద్యార్థులకు రవాణా భత్యం అందించడానికి ఏటా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. అయితే, గతేడాది కొందరు విద్యార్థుల ఖాతాల్లో ఒక ఏడాది సంబంధించి డబ్బులు పడినట్లుగా చెప్పారు. మాకు మాత్రం ఆదేశాలు రాలేదు. మరోసారి సమస్యను ఉన్నతాధికారులకు విన్నవిస్తాం.

-శాంతిరాజు, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి, గద్వాల



జడ్చర్ల న్యూటౌన్: మిడ్జిల్ మండలం వస్పుల ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు వీరు. వల్లభరావుపల్లి, లింబ్యాతండా, దోనూరు, సింగందొడ్డి తదితర గ్రామాల నుంచి సుమారు 40 మంది విద్యార్థులు నిత్యం నాలుగు కిలోమీటర్ల దూరం ఇలా నడిచి, లేదా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి రావాల్సిందే.

అండర్-14 క్రికెట్ విజేత మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాల ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన అండర్-14 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. రాష్ట్రం నుంచి పది జిల్లాల జట్లు హాజరు కాగా, మహబూబ్‌నగర్ ప్రథమ, రంగారెడ్డి, హైదరాబాద్ సంయుక్తంగా ద్వితీయ, నల్గొండ తృతీయ స్థానాలు దక్కించుకున్నాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ తెలిపారు. అనంతరం విజేతలకు జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ ట్రోఫీ అందజేశారు. ఈ క్రమంలో పతకాలను, ప్రశంసా పత్రాలను ఆయన చేతులమీదుగా బహూకరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని కన్వీనర్ శ్రీనివాసులు తెలియజేశారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్, సూపరింటెండెంట్ రామకృష్ణారావు, విజయ్‌పాల్, కృష్ణయ్య, బీసన్న పాల్గొన్నారు.

19న బిజినేపల్లిలో ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లను ఈనెల 19న బిజినేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర) మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఖోఖో సంఘం కార్యదర్శి విలియం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్, బోనఫైడ్‌తో ఉదయం 9 గంటలకు మైదానంలో నివేదించాలని కోరారు. వివరాలకు 95531 24166, 94934 50450 నంబర్లలో సంప్రదించాలన్నారు. రాష్ట్రస్థాయి ఖోఖో జూనియర్స్ టోర్నీ త్వరలో మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలోకి నేడు సీఎం కప్ క్రీడాజ్యోతి పరుగు



మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా టోర్నీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ఈ నెల 3న ఎల్బీ స్టేడియంలో 10 కి.మీ.ల సీఎం కప్ క్రీడాజ్యోతి పరుగు పందెం నిర్వహించింది. ఇదే రోజు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో సీఎం కప్ క్రీడాజ్యోతి వాహన ర్యాలీని ప్రారంభించారు. ఇది రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల మీదుగా ఈనెల 21 వరకు 33 జిల్లాల్లో 2,830 కి.మీ.ల సాగుతుంది. ఈ వాహన ర్యాలీ ఈనెల 18న ఉమ్మడి జిల్లాలో ప్రవేశిస్తుంది. అయిదు జిల్లాల్లో ఈ నెల 20 వరకు కొనసాగుతుంది. జిల్లాల యువజన క్రీడల అధికారులు, క్రీడా సంఘాలు క్రీడాజ్యోతి వాహన ర్యాలీని జయప్రదం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

జిల్లాల వారీగా 10కే రన్ : ఈ నెల 18న ఉదయం నాగర్‌కర్నూల్‌లోని కొత్త కలెక్టరేట్ నుంచి లిటిల్ ఫ్లవర్ పాఠశాల వరకు 10 కి.మీ.ల పరుగు పందెం కొనసాగనుంది. ఇదే రోజు సాయంత్రం వనపర్తి జిల్లాలోని చిట్యాల నుంచి కలెక్టరేట్ వరకు పరుగు నిర్వహిస్తారు. ఈనెల 19న ఉదయం జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు సంగాల పార్కు నుంచి గద్వాలలోని కలెక్టరేట్ వరకు, ఇదే రోజు సాయంత్రం నారాయణపేట జిల్లాలో తిప్రాస్‌పల్లి నుంచి పట్టణంలోని నర్సిరెడ్డి చౌరస్తా వరకు పరుగు కొనసాగుతుంది. ఈ నెల 20న మహబూబ్‌నగర్‌లో క్రీడాజ్యోతి పరుగు డీఎస్‌ఏ మైదానం నుంచి మెట్టుగడ్డ వరకు నిర్వహిస్తారు. యువజన, క్రీడల శాఖ సిబ్బంది, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు పాల్గొంటారు.

ఉమ్మడి జిల్లాలో 370 కి.మీ.లు

నల్గొండ నుంచి వచ్చే వాహన ర్యాలీ ఈనెల 18న చారకొండలో ప్రవేశిస్తుంది. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొడంగల్, సవాయిగూడెం, పెబ్బేరు, ఎర్రవల్లి, జమ్మిచేడు మీదుగా చిట్యాలకు చేరుతుంది. 19న వనపర్తి కలెక్టరేట్, ఆత్మకూరు, జక్లేర్ ధన్వాడ, జాజాపూర్, మరికల్, బండ్రవల్లి, తిప్రాస్‌పల్లిలో, 20న నారాయణపేట, దేవరకద్ర, ధర్మాపూర్, హన్వాడ, పరిగి, కడ్తాల్, మహేశ్వరం, పెద్దఅంబర్‌పేట, తిమ్మాయిపల్లి మీదుగా మంకాల్‌కు చేరుకుంటుంది. ఉమ్మడి జిల్లాలో 370 కి.మీ.లు ర్యాలీ సాగుతుందని డీవైఎస్‌వో శ్రీనివాస్ చెప్పారు.

కురుమూర్తి జాతరకు పక్కా ఏర్పాట్లు: కలెక్టర్



గోడపత్రికను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకురుమూర్తి స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధికారులకు సూచించారు. కురుమూర్తి స్వామి జాతర మైదానంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీలకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 31 నుంచి నవంబరు 18 వరకు స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉద్దాల రోజున 3 లక్షల మంది భక్తులొచ్చే అవకాశం ఉందని భక్తులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు సరిపడా బస్సులు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. జాతర మైదానంలో పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కోనేరులో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు భక్తులకు సేవలందేలా చూడాలన్నారు. 24 గంటలూ విద్యుత్తు, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు గ్రామపంచాయతీలు, పురపాలికల నుంచి సిబ్బందిని కేటాయించాలన్నారు. 108 వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. పార్కింగ్, బారికేడింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. జాతరలో మద్యం విక్రయాలు జరగకుండా ఆబ్కారీ అధికారులు చూడాలన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు, మహిళలకు షీటీంలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆలయ ఛైర్మన్ గోవర్ధన్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పద్మ, ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, డీపీవో పార్థసారథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మానవపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలో 23 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయని ఎస్సై చంద్రకాంత్ తెలిపారు. మండలంలోని జల్లాపురం గ్రామానికి చెందిన ఎరుకలి రవి నుంచి 16 క్వింటాళ్లు, పెద్దపోతులపాడు గ్రామంలో కాసీం నుంచి 7 క్వింటాళ్ల బియ్యాన్ని వనపర్తి జిల్లాలోని పెబ్బేరుకు చెందిన విజయ్, కృష్ణయ్య, ఇటిక్యాల మండలంలోని కొండేరుకు చెందిన వెంకటరాముడు, శివ కొనుగోలు చేసి అశోక్ లే ల్యాండ్ ఆటోలో పెబ్బేరుకు తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించి బియ్యంతో పాటు ఆటోను స్వాధీనం చేసుకొని ఠాణాకు తరలించామన్నారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు పైఆరు మందితో పాటు ఆటో డ్రైవర్ సురేందర్‌పైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బోయపల్లి యువకుడి సైకిల్‌యాత్ర



మహబూబ్‌నగర్ సాంస్కృతికం, మహమ్మదాబాద్ : సనాతన ధర్మ పరిరక్షణ ఆవశ్యకత వివరించేందుకు మహబూబ్‌నగర్ పట్టణ సమీపం బోయపల్లికి చెందిన యువకుడు మల్లేశ్‌గౌడ్ సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టారు. గురువారం బోయపల్లి గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో పూజల తర్వాత యాత్ర ప్రారంభించారు. మల్లేశ్ గౌడ్ మాట్లాడుతూ సనాతన ధర్మ ఔన్నత్యం, దాని పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ రోజూ 100 కి.మీ.లు సైకిల్‌యాత్ర చేసి స్థానిక ఆలయాల్లో బస చేస్తానని తెలిపారు. ఏడాది పాటు కొనసాగే ఈ యాత్రలో భాగంగా దేశంలోని 12 జ్యోతిర్లింగాలను దర్శించుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్‌ను అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, స్థానిక వివిధ యువజన సంఘాలు, ఆలయ కమిటీల ప్రతినిధులు సన్మానించారు. మహమ్మదాబాద్ శివారులో హిందూ వాహిని సభ్యులు శ్రీనివాస్, రఘు, రాకేశ్ తదితరులు స్వాగతం పలికి సన్మానించారు.

కనుల పండువగా కల్యాణం



మంగళసూత్రాలు చూపిస్తున్న పురోహితులు

మల్దకల్, న్యూస్‌టుడే: ఆశ్వీయుజమాసం గురువారం పౌర్ణమి సందర్భంగా మల్దకల్ ఆదిశిలాక్షేత్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదిశిలావాసుడి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గోపూజ, పవమాన హోమం, పంచామృతాభిషేకం, పుష్పార్చన, అలంకరణ, మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం, పల్లకీసేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఊంజలసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో సత్యచంద్రారెడ్డి, చైర్మన్ ప్రహ్లాదరావు, అశోక్‌కుమార్, ముకుందరావు, చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలను కల్యాణానికి తెస్తున్న పూజారులు

ఇంటి నుంచి బయటకెళ్లి.. చెరువులో శవమై..



కిశోర్‌కుమార్

దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని యువకుడు సరూర్‌నగర్ చెరువులో శవమై కనిపించిన ఘటన సరూర్‌నగర్ ఠాణా పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన కాట్రమోని కిశోర్‌కుమార్ (34) తల్లిదండ్రులు, సోదరులతో కలిసి కొంత కాలంగా నగరంలోని నందనవనంలో నివసిస్తున్నారు. కూలీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అయితే కొంతకాలంగా మతిస్థిమితం లేకపోవడంతో కూలీ పనులు మానేశాడు. ఈ నెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి.. తిరిగిరాలేదు. గురువారం చెరువులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో నుంచి పడి యువకుడి మృతి

చేవెళ్ల గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్- బీజాపూర్ రహదారిపై ఆటోలో నుంచి పడి ఒకరు మృతిచెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మర్కల్ గ్రామానికి చెందిన పుట్ట శంకర్(19) హైదరాబాద్‌లోని చేపల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. నగరం చుట్టూ జరిగే సంతల్లో చేపలను విక్రయించడానికి నిత్యం ఆటోలో వెళ్లేవాడు. ఈ క్రమంలోనే చేవెళ్ల మార్కెట్లో చేపలు అమ్మేందుకు మరో ముగ్గురితో కలిసి బయల్దేరాడు. కేసారం గేటు సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి ఒకవైపు ఒరగడంతో అందులో నుంచి శంకర్, రాములు రోడ్డుపై పడిపోయారు. శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి బలవన్మరణం



వీరశేఖర్ (పాత చిత్రం)

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: మనోవేదనతో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. గద్వాల పుర పరిధిలోని నల్లకుంటకు చెందిన వీరశేఖర్ (50) ఎర్రవల్లి మండలం కోదండాపురం జడ్పీహెచ్‌ఎస్‌లో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజులుగా మనోవేదనతో బాధపడుతున్న అతడు తన బాధను కుటుంబ సభ్యులకు వివరించారు. ఆయనకు ధైర్యం చెప్పారు. అయినప్పటికీ గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటికెళ్లిన ఆయన గద్వాల రైల్వే స్టేషన్ సమీపంలోని రెండో రైల్వే గేటు(ఆర్వోబీ) వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరశేఖర్‌కు భార్య మంజులాబాయి(తెలుగు పండిత్), కుమార్తెలు విజ్ఞత (18), వినూత్న(15) ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కుటుంబ సభ్యుల చెంతకు చేరిన యువకుడు



కుటుంబ సభ్యులకు చరణ్ (కుడినుంచి మూడో వ్యక్తి)ను అప్పగిస్తున్న ఎస్సై మంజునాథరెడ్డి, యువకులు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : రెండేళ్ల కిందట అదృశ్యమైన ఓ యువకుడు సామాజిక మాధ్యమం ద్వారా కుటుంబసభ్యుల చెంతకు చేరారు. వనపర్తి జిల్లా కొత్తకోట ఎస్సై మంజునాథరెడ్డి కథనం ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన రాములుకు కుమారుడు చరణ్ (20), ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడికి చిన్నప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి వద్దే ఉండేవారు. రెండేళ్ల క్రితం రాములు ఇల్లు కూలిపోయింది. సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి సామగ్రి తరలించే క్రమంలో కుమారుడు కనిపించకుండా పోయారు. అతని కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చరణ్ ఎక్కడెక్కడో తిరుగుతూ వారం క్రితం కొత్తకోటకు చేరారు. ఇక్కడ ఉన్న యువకులు విష్ణువర్ధన్, రఘు, శ్రీకాంత్‌తో అతను చనువుగా ఉండటంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌ను చూస్తూ పాటలకు నృత్యాలు చేసేవారు. అతని పేరిట వారు ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరచి అతను చేసిన నృత్యాల వీడియోలు పోస్టు చేశారు. వాటిని 14 లక్షలకు పైగా మంది వీక్షించారు. రాములు కుటుంబసభ్యులు చూసి కొత్తకోట యువకులకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. వీడియో కాల్ చేయడంతో చరణ్ తన తండ్రి, అక్కలను గుర్తు పట్టారు. గురువారం కొత్తకోట పోలీసు స్టేషన్‌కు చేరుకున్న రాములుకు చరణ్‌ను అప్పగించామని ఎస్సై తెలిపారు. యువకుడిని కన్నవారి చెంతకు చేర్చిన యువకులను ఆయన అభినందించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

సమస్య: వనపర్తి పట్టణం నాగవరం పదోవార్డులో వీధి దీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.
– కిశోర్, కండక్టర్‌కాలనీ, నాగవరం వనపర్తి

సమాధానం: వార్డులో పగటి పూట దీపాలు వెలుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపించి పగటి పూట దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం.
– పూర్ణచందర్, కమిషనర్ పురపాలిక వనపర్తి

– న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

తెరపై ఈనాడు

శ్రీనివాస: **దేవర,** వెంకటేశ్వర: **విశ్వం**
శ్రీరామా: **వేట్టయన్** – న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

విద్యుదుత్పత్తికి 39,473 క్యూసెక్కుల నీరు

ఆత్మకూరు : జూరాల ప్రాజెక్టు వద్ద వరదనీటి ఉద్ధృతి కొనసాగుతున్న క్రమంలో విద్యుదుత్పత్తికి 39,473 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వరదనీటి లభ్యత మేరకు జెన్‌కో సిబ్బంది ఎగువన ఐదు, దిగువన ఆరు యూనిట్ల ద్వారా ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన 4.298, దిగువన 4.601 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పెబ్బేరు, న్యూస్‌టుడే: వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఏటిగడ్డ శాఖాపూర్, రామాపూర్ గ్రామాల శివార్లలో వర్షాలకు దెబ్బతిన్న పంటను ఆయన బాధిత రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్, తుకారం, చెన్నరాయుడు, రైతులు బాలస్వామి, లక్ష్మణ్, కాశన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

వరి, పత్తికి మద్దతు ధర పెంచాలి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులు అధికంగా పండించే వరి, పత్తి పంటలకు కనీస మద్దతు ధర పెంచాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుజరాత్‌లో పత్తికి చెల్లిస్తున్న ధరను అన్ని రాష్ట్రాల్లో చెల్లించాలన్నారు. వరికి మద్దతు ధర పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాములు, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ.. ఉపాధికి నిచ్చెన



మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రంలో విలువ ఆధారిత పోష్టికాహార ఉత్పత్తులపై శిక్షణ

మదనాపురం, కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : జొన్న, సజ్జ, రాగి పిండితో రొట్టెలు, అంబలి, కుడుములు, కొర్రలతో పాయసం చేసుకుని తింటాం. వాటితో బిస్కెట్లు, లడ్డూలు, కేకులు, చాక్లెట్లు, మురుకులు వంటి విలువ ఆధారిత పౌష్టికాహార ఉత్పత్తులు తయారు చేసే విధానంపై మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం వారు యువతకు శిక్షణ ఇచ్చి వారిని స్వయం ఉపాధి వైపు తీసుకెళ్తోంది. జొన్న, సజ్జ, రాగులు, కొర్రలతో చేసే చిరుతిళ్లు, ఆహారపదార్థాలపై వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చింది. శిక్షణలో నేర్చుకున్న పలు అంశాలు ఎంతో ఉపయోగంగా, వ్యాపార విస్తరణకు దోహదపడుతుందని యువత పేర్కొన్నారు.



జొన్న, సజ్జ, రాగులు, కొర్రలతో తయారు చేసిన బిస్కెట్లు, లడ్డులు, చాక్లెట్లు



కొత్త రకం వంటలు తెలుసుకున్నా..: నేను డిగ్రీ పూర్తి చేశా. ఇంట్లో అమ్మ వాళ్లు రొట్టెలు చేస్తుంటే చూసేదాన్ని. అదే పిండితో కొత్త రకాల వంటలు చేయవచ్చనే విషయం నాకు తెలియదు. శిక్షణకు వచ్చిన తరువాత చాలా అంశాలు నేర్చుకున్నా. ఇంట్లో పౌష్టికాహారం తయారు చేసి కుటుంబ సభ్యులకు అందించేందుకు ఎంతో ఉపయోకరంగా ఉంది. భవిష్యత్తులో స్వయం ఉపాధి వైపు అడుగులు వేసేందుకు శిక్షణ ఉపయోగపడుతుంది. – సాయి కీర్తన, వనపర్తి



వ్యాపార విస్తరణకు ఉపయోగం: నేను బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేశా. మా అమ్మ బేకరీ నిర్వహిస్తారు. ఆమెకు తోడుగా ఉంటుందని శిక్షణ తీసుకున్నా. ప్రస్తుతం శిక్షణలో కేకు, బిస్కెట్స్, చాక్లెట్లు, కప్ కేక్స్ వంటివి తయారు చేసే విధానాన్ని నేర్పించారు. తక్కువ ఖర్చుతోనే పిల్లలకు, పెద్దలకు విలువ ఆధారిత పౌష్టికాహారం అందించడంతో పాటు మా వ్యాపారాన్ని వృద్ధి చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. – మమత, అమరచింత



స్వయం ఉపాధి పొందుతా: నేను ఐటీఐ పూర్తి చేశా. మానాన్నకు ఆరోగ్యం బాగోలేకపోతే పౌష్టికాహారం అందించడంతో ప్రస్తుతం కోలుకున్నారు. ఇంటి వద్దే చిరువ్యాపారం ప్రారంభిద్దామని ఆయన చెబితే నేను శిక్షణకు వచ్చా. తక్కువ ఖర్చుతో ఇంటి వద్ద వీటిని తయారు చేసి స్వయం ఉపాధి పొందవచ్చు. ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. ఇప్పుడు వీటిని ఇంటి వద్ద తయారు చేస్తాం. – శివసాయి, పెబ్బేరు



కిరాణంలో విక్రయించడానికి..: మాకు కిరాణం దుకాణం ఉంది. ఇందులోకి కావాల్సిన చాలా వస్తువులను బయటి నుంచే కొనుగోలు చేస్తాం. గతంలో మా అత్త కేవీకేలో శిక్షణ పొందారు. ఆమె సూచనతో శిక్షణ తీసుకున్నా. చాక్లెట్లు, బిస్కెట్లు, కేకులు వంటి వాటిని తయారీని నేర్చుకున్నా. వీటిని ఇంటి వద్ద తయారు చేసి తక్కువ ధరలోనే విక్రయించడం ద్వారా పౌష్టికాహారం అందడంతో పాటు మా వ్యాపారం పెరుగుతుంది. – కవిత, వనపర్తి



యువతను ప్రోత్సహించేందుకే..: స్వయం ఉపాధి రంగంలో యువతను ప్రోత్సహించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన, శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. మనం రోజు ఇంట్లో ఉపయోగించే వాటినే పౌష్టికాహారంగా ఎలా మార్చుకోవాలి, వాటిని ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై తరగతుల నిర్వాహణతో పాటు ప్రత్యక్షంగా తయారు చేసే విధానాన్ని నేర్పిస్తాం. ఆసక్తి ఉన్న యువత, మహిళలు ముందుకు వస్తే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వపథకాల ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు కావాల్సిన సహాయ, సహకారాలను అందిస్తాం. – అనిత, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, మదనాపురం

క్రీడల్లో రాణించాలి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, ఎంఈవో మద్దిలేటి, మార్కెట్ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పుర వైస్ ఛైర్మన్ పాకనాటి కృష్ణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయిని తారాబాయి తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీమాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని పాన్‌గల్‌రోడ్డులో చౌడేశ్వరిమాతను గురువారం పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేయాలని కమిటీ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, కౌన్సిలర్ చీర్లసత్యంసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పట్టా పాస్ పుస్తకం రద్దు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో పల్లెగట్టు వద్ద ఉన్న అసైన్డ్ భూమిని 2012లో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నకిలీ ధ్రువపత్రాలతో పట్టా పుస్తకాన్ని పొందడంతో గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలతో తహసీల్దార్ లక్ష్మి విచారణ చేసి నివేదికలను ఆర్డీవోకు పంపారు. సదరు భూమి నకిలీ పత్రాలతో పొందినదని తేలడంతో పట్టా పుస్తకాన్ని ధరణి సైట్‌లో రద్దు చేశారు.

మందుల నిల్వ భవనం వినియోగంలోకి తీసుకురావాలి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : మందుల నిల్వ చేసేందుకు నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తీవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. గురువారం వనపర్తిలో మర్రికుంటలో మందులు నిల్వ చేసేందుకు నిర్మించిన భవనాన్ని ఆయన పరిశీలించారు. భవనం వినియోగంలోకి రాకపోవడానికి గల కారణాలను గుత్తేదారును, సిబ్బందినడిగి తెలుసుకున్నారు. పది రోజుల్లో రహదారి పనులు పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం పాత ఎస్టీవో కార్యాలయంలో మందుల నిల్వ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పట్టణంలోని బాలసదనం భవనాన్ని ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాయినాథ్‌రెడ్డి, సంక్షేమశాఖాధికారిణి లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాండురంగస్వామి రథోత్సవం


మూలమల్లలో పాండురంగస్వామి రథోత్సవం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని మూలమల్ల గ్రామంలో పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున పూజల అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భజన కీర్తనల మధ్య రథోత్సవం తిరిగి ఆలయానికి చేరింది. భక్తులకు అన్నప్రసాద వితరణ కొనసాగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, భారాస నాయకులు రవికుమార్‌యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, విశ్వేశ్వర్, భీమన్న, మాజీ సర్పంచి సురేందర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, భజన మండలి అధ్యక్షుడు భగవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పాండురంగస్వామిని దర్శించుకున్న వాకిటి

ఆత్మకూరు : ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలోని పాండురంగస్వామి ఆలయాన్ని గురువారం రాత్రి ఎమ్మెల్యే శ్రీహరి దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కల్చరల్ కార్యక్రమ విభాగం రాష్ట్ర కన్వీనర్ నాగరాజుగౌడ్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్య పరిష్కరించాలని వినతి

పెబ్బేరు పట్టణం : మండలంలోని గుమ్మడం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని, కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. లో వోల్టేజి ఇబ్బందులు ఉన్నందున అదనంగా రెండు 25 కేవీఏ, డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని గురువారం వనపర్తిలో ఎమ్మెల్యే మేఘారెడ్డికి జయహో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానించిన టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ సభ్యులు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పెబ్బేరు మండలానికి వచ్చిన కొత్త ఉపాధ్యాయులు జాన్సన్, భాగ్యలక్ష్మి, రహమాన్, అనూష, ఓంకార్‌ను టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ గురువారం సన్మానించారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జయరాములు, సమాఖ్య మండల గౌరవ అధ్యక్షుడు బుసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షుడు చిన్నస్వామి, వెంకటేశ్, ఆంజనేయులు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు సీఆర్ఆర్ నిధులు


వడ్డెవాట-సత్యహళ్లి రహదారి

కొత్తకోట, న్యూస్‌టుడే: దేవరకద్ర నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులకు ప్రభుత్వం సీఆర్ఆర్ (నియోజకవర్గ గ్రామీణ రోడ్లు) నిధులు విడుదల చేసింది. మొత్తం 16.71 కి.మీ. రహదారుల పునరుద్ధరణకు రూ.15 కోట్లు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కొత్తకోట మండలం వడ్డెవాట-సత్యహళ్లి రోడ్డుకు రూ. కోటి, అడ్డాకల్ మండలం రాచాల-ఇన్రంపల్లి రహదారికి రూ.55 లక్షలు, చౌదర్‌పల్లి రోడ్డుకు రూ.55 లక్షలు, దుబ్బపల్లి రోడ్డుకు రూ.60 లక్షలు, కందూర్-వడ్డెపల్లి రోడ్డుకు రూ.1.05 కోట్లు, చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్-సీతారాంపేట రహదారికి రూ.3 కోట్లు, లక్ష్మీదేవపూర్-ఉండ్యాల-మద్దూర్ లింక్ రోడ్డుకు రూ.2.50 కోట్లు, దేవరకద్ర మండలం గద్దెగూడెం-కోటకదిరె రోడ్డు కోసం రూ.1.20 కోట్లు, బస్వాయిపల్లి- నందిపేట రోడ్డుకు రూ.2.55 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఎల్వోసీ అందజేత

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన రజనీ బాబు అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని పార్టీ నాయకుడు శేఖర్ ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. చికిత్స కోసం బాధిత కుటుంబానికి గురువారం హైదరాబాద్‌లో రూ.5 లక్షల ఎల్వోసీని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్రాములు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి చక్రస్నానం

వనపర్తిగ్రామీణం : మండలంలోని అంకూర్ గ్రామంలో శరన్నవ రాత్రి ఉత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం సీతారామాంజనేయ ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహన్నికి చక్ర స్నానం నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు, అష్టోత్తర పూజల అనంతరం, చక్రస్నానంతో ఉత్సవాలు ముగించినట్లు గ్రామస్థులు తెలిపారు.

వాల్మీకుల మధ్య చిచ్చు తగదు

వనపర్తి పట్టణం : వివేకానంద చౌరస్తాలో వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో కాకుండా గురువారం ఎమ్మెల్యే మేఘారెడ్డి మరోచోట భూమిపూజ చేయడం వాల్మీకుల మధ్య చిచ్చు పెట్టడమే అని వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ఆరోపించారు. గురువారం రాత్రి వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో గతంలో కేటాయించిన స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. మాజీమంత్రి నిరంజన్ రెడ్డి స్థలం కేటాయించి భూమి పూజ చేశారని ఎన్నికల కోడ్ వల్ల విగ్రహ ఏర్పాటు నిలిచిపోయిందన్నారు. మిషన్ భగీరథ పైలాన్ పక్కన కులస్థులకు సమాచారం ఇవ్వకుండా భూమి పూజ చేయడం తగదన్నారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు బాలికల వాలీబాల్ జట్టు గురువారం వనపర్తిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటింది. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 17 ఏళ్లలోపు బాలికల విభాగం పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది. జట్టు సభ్యులను శిక్షకుడు ఖాదర్, పీఈటీ సంతోష, జాతర మైదానం వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

నేడు అమరచింతలో నీటి సరఫరా బంద్

అమరచింత, న్యూస్‌టుడే : ఎర్రగట్టు సంపు, మోటార్ హౌస్ వద్ద నియంత్రిక కాలి పోవడంతో పట్టణంలో శుక్రవారం మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు కమిషనర్ నూరుల్ నజీబ్ తెలిపారు. ప్రజల అవసరం నిమిత్తం పుర ట్యాంకరు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పట్టణంలోని మిషన్ భగీరథ సంపు హౌస్‌కు నీటి సరఫరా లేక పోవడంతో పామిరెడ్డిపల్లె, కొంకలవానిపల్లె గ్రామాలకు కూడ నీటి సరఫరా ఉండదు.

యువకుల శ్రమదానం

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని అంజనగిరి గ్రామంలో గురువారం గ్రామంలోని ప్రధాన రోడ్డు వెంట ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను గ్రామంలో యువకులు శ్రమదానం చేసి తొలగించారు. యువకులు శ్రీశైలం, గణేశ్, హరికృష్ణ, శంకర్‌లు తదితరులు పాల్గొన్నారు.


నాగవరంలో వాల్మీకి విగ్రహం వద్ద సంఘం నాయకులు


పామాపురంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి


మూలమల్లలో హాజరైన మాజీ ఎమ్మెల్యే చిట్టెం

వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకం

న్యూస్‌టుడే, బృందం: రామాయణాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన వాల్మీకి మహర్షి జయంతిని వాల్మీకి సంఘం నాయకులు జిల్లాలో ఘనంగా జరుపుకొన్నారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు, ఆసుపత్రిల్లో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సంఘం నాయకులు, వివిధపార్టీల నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పెబ్బేరు: నివాళులర్పిస్తున్న వాల్మీకి సంఘం, కాంగ్రెస్ నాయకులు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో పుర కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పుర కమిషనర్లు, ఆర్ఐ, నీటిపారుదల ఏఈలతో సమన్వయం చేసుకుని త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, పురపాలికల కమిషనర్లు, ఆర్ఐలు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కేసు

వనపర్తి న్యూటౌన్ : బాల్య వివాహాలను ప్రోత్సహించడం, బాలలను పనిలో పెట్టుకొని కార్మికులుగా మార్చే వారిపై తప్పనిసరిగా ఎఫ్ఆర్ఆర్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. గురువారం వనపర్తి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌తో కలిసి జిల్లా మహిళా శిశు సంక్షేమ, బాలల పరిరక్షణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల చివరి వారంలో చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్ వీక్ సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీడబ్ల్యూవో లక్ష్మమ్మ, డీసీపీవో రాంబాబు, ఆర్డీఎస్ సంస్థ అధ్యక్షురాలు చిన్నమ్మథామస్, సఖి కేంద్ర సీఏ కవిత, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

వనపర్తి న్యూటౌన్ : మహిళలను మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ అన్నారు. గురువారం వనపర్తి కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, మెప్మా అధికారులతో మహిళా శక్తి పథకం యూనిట్ల లక్ష్యం, బ్యాంక్ లింకేజి తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి : మంత్రి జూపల్లి


మహబూబ్‌సుభాని దర్గా వద్ద ప్రార్థనలో మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్, న్యూస్‌టుడే : పేరుగాంచిన పాన్‌గల్ బారాషహీద్ దర్గా వద్ద మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. గురువారం పాన్‌గల్‌లో గ్రామస్థులు కుల మతాలకు అతీతంగా మహబూబ్‌సుభాని దర్గా గంధోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రితో పాటు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి వందలాదిగా భక్తులు తరలివచ్చే బారా షహీద్ దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం వసతులకు రూ.కోటి నిధులు ఇస్తానని వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలతో సమావేశమై సమస్యలు అడిగితెలుసుకొని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

చేపపిల్లలను వదిలిన మంత్రి

వనపర్తి న్యూటౌన్ : పట్టణంలోని నల్లచెరువులో గురువారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు చేప పిల్లలను వదిలారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే మేఘారెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పుర ఉపాధ్యక్షుడు పాకనాటి కృష్ణయ్య, పలువురు కౌన్సిలర్లు, మత్స్యశాఖ జిల్లా అధికారి లక్ష్మప్ప, సహకార సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భారాస హయాంలోనే ముదిరాజ్‌ల అభ్యున్నతి


మాట్లాడుతున్న మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: భారాస హయాంలోనే ముదిరాజ్‌ల అభ్యున్నతి జరిగిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మామిడిమాడ గ్రామంలో ముదిరాజ్ గ్రామ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనాన్ని సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీమంత్రి మాట్లాడారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి గతంలో కేసీఆర్ చెరువులను అభివృద్ధి చేసి చేప పిల్లలను పంపిణీ చేశారని తెలిపారు. అంతకుముందు శాపూర్ గ్రామంలో ఆయన వాల్మికీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండగ సాయన్న విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కప్పెట సాయిలు, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ సామ్య నాయక్, భారాస మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కానాయపల్లి స్టేజీ వద్ద ఉన్న శ్రీకోటిలింగేశ్వరాలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా శివపార్వతుల కల్యాణం వేడుకగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు జగదీశ్, అనిల్ తెలిపారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అర్చనలు, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. 11 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం, ఉమామహేశ్వర వ్రతం నిర్వహించినట్లు వారు వివరించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మహిళ మృతదేహం లభ్యం


సావిత్రి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: భీమా కాలువలో పడిన మహిళ సావిత్రి (32) మృతదేహం లభ్యమైంది. గ్రామీణ ఎస్సై జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కడుకుంట్ల గ్రామానికి చెందిన యాదయ్య, సావిత్రి బుధవారం గొర్రెలను మేపేందుకు తీసుకెళ్లారు. భీమా కాలువలో సావిత్రి ప్రమాదవశాత్తు పడ్డారు. శ్రీరంగాపురం మండలం తాటిపాముల శివారులో ఆమె మృతదేహం లభ్యమైంది. బాధిత తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భీమా కాలువలో వ్యక్తి..

ఆత్మకూరు : రామన్‌పాడ్ జలాశయం కుడి విభాగం భీమా సమాంతర కాలువలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మత్స్యకారుడు పిట్టల గోవర్ధన్ ఇచ్చిన సమాచారం మేరకు మేడేపల్లి గ్రామ కార్యదర్శి కారెడ్డి శిరీష ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నరేందర్ తెలిపారు.

ధరూరు చెరువులో..

ధరూరు : సమీపంలోని పెద్దచెరువులో గురువారం మృతదేహం లభ్యమైంది. గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మకూరుకు చెందిన చాకలి వెంకటేశ్ ధరూరులో ఓ ఇంట్లో గత కొంత కాలంగా పనిమనిషిగా ఉంటున్నాడు. రెండు రోజుల కిందట బహిర్భూమికని చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు చెరువు సమీపంలో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులంటున్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకట్రాములు తెలిపారు.

ప్రయాణికుడి మృతి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : ఓ ప్రయాణికుడు కొత్తకోటలో ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. ప్రయాణికుల కథనం ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ఉప్పేరుకు చెందిన కోటన్న (50) హైదరాబాద్‌లో బసెక్కారు. కొత్తకోట వద్దకు రాగానే ఆయనకు వాంతులు, విరేచనాలు కావడంతో బస్సు నుంచి కిందకు దిగారు. వెంటనే అక్కడే కుప్పకూలిపోయారు. ప్రయాణికులు 108 అంబులెన్స్ వారికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. కోటన్న వద్ద ఉన్న చరవాణితో బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

పెద్దమందడి (వనపర్తి న్యూటౌన్), న్యూస్‌టుడే: పెద్దమందడికి చెందిన గొల్లచిట్టన్న(45) కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గొల్లచిట్టన్న కడుపునొప్పి భరించలేక బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి పోయారు. గ్రామ సమీపంలో ఈద్గా మైదానం వద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకున్నారు. గురువారం ఉదయం స్థానికులు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై సిబ్బందితో వెళ్లి మృతదేహానికి శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లక్కీ డ్రా నిందితుల రిమాండ్

చిన్నంబావి, న్యూస్‌టుడే: మండలంలో లక్కీ డ్రా స్కీం పేరిట ప్రజలను మోసం చేసిని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. చిన్నంబావి మాజీ సర్పంచి రంజిత్‌తో పాటు, మండలంలోని వెలటూరుకు చెందిన తిరుమలేశ్, అయ్యవారిపల్లికి చెందిన ఖాదర్, కొల్లాపూర్ మండలం కుడికిళ్ల, సోమశిలకు చెందిన లక్ష్మణ్, నిరంజన్‌ను రిమాండ్ చేశామని పేర్కొన్నారు. మొత్తం రూ.63 లక్షలు మోసం జరిగిందని, 432 మంది బాధితులు ఉన్నట్లు వివరించారు.

ఉత్సాహంగా కళా ఉత్సవ్ పోటీలు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని బాలభవన్‌లో కళా ఉత్సవ్ పోటీలు గురువారం రెండో రోజు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా పరిషత్ చిట్యాల, హరిజన్‌వాడ పాఠశాల విద్యార్థులు నృత్య, విజువల్ ఆర్ట్స్ ప్రదర్శనలు, జానపద కళలు ప్రదర్శించారు. మొత్తం పది పాఠశాలల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఈవో కార్యాలయం సమన్వయకర్త మహానంది, బాలభవన్ నిర్వాహకురాలు నిరీష తదితరులు పాల్గొన్నారు.

గుంతల రహదారి.. అవస్థలు తప్పవు మరి


బురదలో ఇరుకుపోయిన ఆటోను తోస్తున్న ప్రయాణికులు

పెద్దమందడి(వనపర్తి పట్టణం), న్యూస్‌టుడే : మండలంలోని మణిగిల్ల గ్రామ సమీపంలో వెంకన్న చెరువు అలుగు నీరు ప్రవహించి కల్వర్టు వద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల గ్రామస్థులు కొందరు మట్టి వేయించగా బుధవారం రాత్రి కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. గురువారం ఉదయం పాఠశాల, ద్విచక్ర వాహనాలు బురదలో కూరుకుపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతి వేతనాలు చెల్లించాలి

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం జనవరి 2024లో చిన్న అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతి కల్పించినా వాటికి తగ్గ వేతనం అందించడం లేదని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సీడీపీవో కార్యాలయంలోని అధికారులకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసినట్లు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్ల, సహాయకుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా వారు అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై మాట్లాడారు.

పెబ్బేరు : జిల్లాలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీలుగా పదోన్నతి కల్పించి వాటిలో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతి వేతనాలు ఇవ్వడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అన్నారు. గురువారం పట్టణంలోని సీడీపీవో కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.